
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 33.0
కనిష్ఠం 24.2
**

ANDHRAJYOTHY



సూర్యాపేట

5

గురువారం 27 జూన్ 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.20 (122.0338)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.70 (2.71)	78.39	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	94.29 (0.38)	నిల్	50

చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230



చేప పిల్లల పంపిణీపై స్పష్టతేదీ?

ఉచిత చేపల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వ మాట కోసం మత్స్యకారులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పూర్తికావాల్సిన టెండర్ల ప్రక్రియపై ప్రభుత్వం నుంచి ఎటువంటి చర్యలు లేకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పథకాన్ని కొనసాగిస్తారా లేదా అనే మీమాంస మత్స్యకార్మికుల్లో నెలకొంది. కొన్నేళ్లుగా చేపల పెంపకం, విక్రయంతో జీవనోపాధి పొందుతున్న కార్మికులు ప్రభుత్వ తీరుతో ఆవేదనకు లోనవుతున్నారు.

- పథకం నిర్వహణపై ఎటూ తేల్చని ప్రభుత్వం
- జరగని సమీక్షా సమావేశాలు
- గతంలో ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి

సూర్యాపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నీటివనరుల్లో చేపల పెంపకం కోసం ప్రభుత్వం అందించే ఉచిత చేపపిల్లల పంపిణీపై స్పష్టత కరువైంది. ప్రభుత్వం నేటి వరకు అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేయకపోవడంతో పథకం ఉంటుందా, ఏమైనా మార్పులు చేస్తున్నారా అనే సందిగ్ధత మత్స్యకారుల్లో నెలకొంది. సాధారణంగా మే నాటికి టెండర్లను పూర్తి చేసి ఆగస్టులో చేపపిల్లలను చెరువుల్లోకి వదులుతారు. వర్షాకాలం ప్రారంభమైనా నేటి వరకూ టెండర్లను పిలవకపోవడం అనుమానాలు తలెత్తుతున్నాయి. ఒకవేళ పథకాన్ని కొనసాగించాల్సి వచ్చినా పంపిణీలో ఆలస్యం జరిగే అవకాశం ఉంది. దీంతో చేపపిల్లల ఎదుగుదలపై ప్రభావం పడే అవకాశం ఉందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం కిలో నుంచి రెండు కిలోల చేపలు ఉన్నప్పుడే విక్రయిస్తే మంచి ధరలు పలుకుతుందంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం చేపపిల్లలను పంపిణీ చేయాలనుకుంటే తొందరగా చేపట్టాలంటున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మత్స్యకారులను అభివృద్ధి పథంలో తీసుకురావడానికి ఉచితంగా మోపెడ్ లు, వలలు, మినీ వ్యాన్లను పంపిణీ చేసింది. చేపలను తీసుకెళ్లడానికి, విక్రయించడానికి సామాగ్రిని సైతం అందజేసిం ది. అయితే కొత్త ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు దాటింది. పథకాన్ని ప్రక్షాళన చేయాలని భావిస్తోందా అనే ప్రశ్న తలెత్తుతోంది.



గతంలో మాదిరి ఆరోపణలు రాకుండా నాణ్యమైన చేపపిల్లలను పంపిణీ చేస్తే ఎంతో బాగుంటుందని మత్స్యకారులు అభిప్రాయపడుతున్నారు.

గత ప్రభుత్వం జిల్లాలో రూ.5 కోట్ల విలువైన 4.23కోట్ల చేప పిల్లలను పంపిణీ చేసింది. గతంలో నాసిరకం పిల్లలను కూడా పంపిణీ చేస్తున్నారని ఆరోపణలు కూడా వచ్చాయి. నాలుగేళ్ల నుంచి 100 శాతం రాయితీతో ఉచితంగా విత్తన చేప పిల్లలను పంపిణీ చేస్తున్నారు. పంపిణీ బాధ్యతను మత్స్యశాఖకు అప్పగించింది. వీరి పర్యవేక్షణలో కాంట్రాక్టర్లు చేపపిల్లలను పంపిణీ చేసేవారు. శాస్త్రీయమైన లెక్కలు లేకుండా డ్రమ్ముల్లో లక్ష వంతున, ప్లాస్టిక్ సంచిలో 10వేలు, ప్యాకెట్లలో 1000 పిల్లలంటూ కాకి లెక్కలతో చెరువులు, కుంటలు, రిజర్వాయర్‌లో వదిలారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణలో వదులుతున్నప్పటికీ ప్రతి చెరువులో పాతిక శాతం మేర తక్కువ సరఫరా చేస్తున్నారని కాంట్రాక్టర్లు కోట్లలో స్వాహా చేస్తున్నారని విమర్శలున్నాయి. అయితే ఒక వేళ పథకాన్ని కొనసాగించాల్సి వస్తే ఈ పర్యాయం ఎటువంటి ఆరోపణలు రాకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. అధికారులతో ఎప్పటి కప్పుడు తనిఖీలు నిర్వహించి పథకంలో లోపాలను సవరించే అవకాశం ఉందంటున్నారు. పంపిణీపై వారం రోజుల్లో ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు



ప్రభుత్వం నుంచి చేపపిల్లల పంపిణీపై ఎలాంటి ఆదేశాలు రాలేదు. త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. గతంలో నాలుగు సంవత్సరాలుగా చేపపిల్లల పంపిణీ చేపట్టాం.

\- రూపేందర్‌సింగ్, మత్స్యశాఖ జిల్లా అధికారి

జిల్లాలో చేపల పంపిణీ ఇలా

జిల్లాలో 134 మత్స్యసహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో 15,736 మంది సభ్యులు ఉన్నారు. వీరు కాక అనధికారికంగా సభ్యులు ఉన్నారు. మూసీ రిజర్వాయర్‌తో పాటు 1,340 చెరువులు ఉన్నాయి. గతంలో వర్షాధార చెరువుల్లో 30-40ఎంఎం చేపలు, నిత్యం నీరు ఉండే చెరువుల్లో 80-100 ఎంఎం చేపలను వదిలారు. 30-40 ఎంఎం పరిమాణం గల చేపకు 62 పైసలు, 80-100 ఎంఎం చేపకు రూ.1.35పైసలు ప్రభుత్వం కాంట్రాక్టర్లకు చెల్లించింది. దూరప్రాంతాల నుంచి చేపలు తేవడం వల్ల పిల్లలు చనిపోతున్నాయని భావించి స్థానికంగా ఉండే కాంట్రాక్టర్లకు బాధ్యతలను అప్పజెప్పారు. అయితే పంపిణీలో అడుగడుగునా నిర్లక్ష్యం కనిపించింది. సకాలంలో చేపపిల్లలను సరఫరా చేయకపోవడం, నాసిరకం పిల్లలను సరఫరా చేయడంతో అవి చనిపోతుండడంతో మత్స్య కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. సకాలంలో చేపపిల్లలను చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో వదలకపోతే అవి పెరిగే అవకాశం తక్కువగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

త్వరగా పంపిణీ చేయాలని కోరుతున్నారు. గత ఏడాది కూడా ఆలస్యంగా చేప పిల్లలను పంపిణీ చేయడంతో కొన్నిచోట్ల చేపలు పెరగలేదని, కేవలం 50 గ్రాముల నుంచి 100 గ్రాములు మాత్రమే పెరిగాయంటున్నారు. ప్రభుత్వ లక్ష్యం బాగానే ఉన్నా శాస్త్రీయ లెక్క ప్రకారం పంపిణీ జరగడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వమే ఫిష్‌పాంట్స్‌ను ఏర్పాటు చేసి నాణ్యమైన పిల్లలను నిర్దేశిత పరిమాణంలో పంపిణీ చేస్తే బాగుంటుందని మత్స్యకార సంఘాలు పేర్కొంటున్నాయి.



డీసీసీబీ చైర్మన్‌పై అవిశ్వాస ఓటింగ్ రేపే

నల్లగొండ డీసీసీబీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ఓటింగ్‌కు సన్నద్ధమయ్యారు. శుక్రవారం ఓటింగ్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రస్తుత చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై కాంగ్రె‌స్‌కు చెందిన డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో 14 మంది డైరెక్టర్లు తెలంగాణ సహకార చట్టం-1964, సెక్షన్ 34/ఏ ప్రకారం ఈ అవిశ్వాసపు నోటీసులు ఇచ్చారు. ఈ చట్టం నిబంధనల మేరకు ఈ నెల 28న అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్‌కు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా సహకార అధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొనాల్సిందిగా డీసీసీబీ డైరెక్టర్లందరికీ ఇప్పటికే నోటీసులు అందజేశారు.

\- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

- శిబిరంలోనే కాంగ్రెస్ మద్దతు డైరెక్టర్లు
- నేటి రాత్రికి హైదరాబాద్‌కు రానున్న డైరెక్టర్లు
- అమెరికా పర్యటనలో ఉన్న వైస్ చైర్మన్ వచ్చేనా..?
- అవిశ్వాసం వీగిపోతుందనే ధీమాలో 'గొంగిడి'

చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు పట్టుదలతో ఉన్న కాంగ్రెస్‌నేతలు తమకు అనుకూలంగా ఉన్న 14 మంది డైరెక్టర్లను కేరళలోని ప్రత్యేక శిబిరానికి తరలించారు. క్యాంపులో ఉన్న వీరంతా గురువారం రాత్రికి హైదరాబాద్ చేరుకుంటారని, శుక్రవారం నేరుగా సమావేశానికి ప్రత్యేక బస్సులో వస్తారని చెబుతున్నారు. సహకార చట్టం నిబంధనల అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే పాలకవర్గ సభ్యుల్లో మూడింట రెండు వంతుల మంది సభ్యులు అవిశ్వాసానికి అనుకూలంగా ఓటేయాలి. ఈప్రకారం మొత్తం 19 మంది డైరెక్టర్లకు 14మంది అవిశ్వాసానికి అనుకూలంగా ఓటేయాల్సి ఉంటుంది. అవిశ్వాసం నోటీస్‌పై సంతకం చేసిన డైరెక్టర్లు 14 మంది కాంగ్రెస్ శిబిరంలోనే ఉండడంతో అవిశ్వాసం నెగ్గుతుందనే ధీమా కాంగ్రెస్ నేతల్లో వ్యక్తమవుతోంది. వీరంతా అవిశ్వాసానికి అనుకూలంగా ఓటేస్తే గొంగిడి మహేందర్‌రెడ్డి చైర్మన్ పదవీచ్యుతులవుతారు. తదుపరి చైర్మన్ ఎన్నికకోసం మళ్లీ 15 రోజుల్లోపు గడువుతో నోటీసులిచ్చి, చైర్మన్ ఎన్నికను నిర్వహించాల్సి ఉంటుంది. డైరెక్టర్లను సమీకరించి గొంగిడి మహేందర్‌రెడ్డిపై అవిశ్వాస ఘట్టానికి తెరలేపిన డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డికే తదుపరి చైర్మన్‌గా అవకాశం దక్కుతుందనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో సాగుతోంది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ప్రధాన అనుచరుడైన కుంభం ఇప్పటికే తమకు మద్దతుగా ఉన్న డైరెక్టర్లందరితో కలిసి కేరళలో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నారు. మరోవైపు డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్‌తో కలిసి ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో మాట్లాడుతూ డైరెక్టర్లు చేజారకుండా చూసుకుంటూ తనకు అనుకూల వాతావరణాన్ని ఏర్పర్చుకున్నారు.

అవిశ్వాసం వీగిపోతుందనే ధీమాలో 'గొంగిడి'

డీసీసీబీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం వీగిపోతుందనే ధీమా బీఆర్‌ఎస్‌లో వ్యక్తమవుతోంది. పార్టీ మారనందుకే తమపై కాంగ్రెస్ సీనియర్లు అవిశ్వాసానికి అండగా ఉంటున్నారని, కానీ తమ హయాంలో డీసీసీబీని ముందంజలో ఉంచిన విషయం డైరెక్టర్లందరికీ తెలుసని, వారు తనకు అండగా ఉంటారని, అవిశ్వాసం వీగిపోతుందనే ధీమాలో చైర్మన్ మహేందర్‌రెడ్డి ఉన్నారు. అవిశ్వాస తీర్మానంపై సంతకం చేసినప్పటికీ అందులో తమపార్టీకి చెందినవారు ఆరుగురు డైరెక్టర్లున్నారని, వారంతా అవిశ్వాసానికి వ్యతిరేకంగానే ఓటేస్తారని భావిస్తున్నారు. మరోవైపు వైస్ చైర్మన్ సైతం విదేశాల్లో ఉన్నందున ఓటింగ్‌కు హాజరుకాలేరని, కాంగ్రెస్ ప్రోద్బలంతో ప్రవేశపెట్టిన అవిశ్వాసం వీగిపోతుందని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డితోపాటు, డైరెక్టర్లు రంగాచారి, అప్పిరెడ్డి, పల్లా ప్రవీణ్‌రెడ్డి అవిశ్వాసానికి వ్యతిరేకంగా ఉండగా, విదేశాల్లో ఉన్న వైస్‌చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి ఓటింగ్‌లో పాల్గొనే అంశంపై స్పష్టత రావడంలేదు. ఆయన సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారని, తమకు టచ్‌లోనే ఉన్నారని, అవిశ్వాస ఓటింగ్ సమయానికి వస్తారని తమకు అనుకూలంగా ఓటేస్తారని కాంగ్రెస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తుంటే, ఆయన సమావేశానికి రావడంలేదని, అవిశ్వాసం వీగిపోతుందని బీఆర్‌ఎస్ నేతలు ప్రకటిస్తుండడంతో ఉత్కంఠ కొనసాగుతోంది.

రూ.400 కోట్లతో రహదారుల నిర్మాణం

- ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ మోహన్‌నాయక్



రహదారుల నిర్మాణంపై సమీక్షిస్తున్న ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ మోహన్‌నాయక్

హుజూర్‌నగర్, జూన్ 26 : గ్రామీణ రహదారులను రూ.400 కోట్లతో నిర్మించనున్నట్లు ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ జే మోహన్‌నాయక్ తెలిపారు. బుధవారం పట్టణంలోని రహదారి బంగ్లాలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో సుమారు రూ.400 కోట్లతో రహదారుల నిర్మాణాలు చేపడుతున్నామని చెప్పారు. హుజూర్‌నగర్-మట్టపల్లి మధ్య 25 కిలోమీటర్ల మేర రూ.75 కోట్లతో రోడ్డు విస్తరణ జాతీయరహదారి నాణ్యత మాదిరి ఉంటుందన్నారు. రహదారులను మరింత విస్తరిస్తామన్నారు. రూ.60కోట్లతో లింకురోడ్లను బీటీరోడ్లుగా మారుస్తామన్నారు. ఇప్పటికే రూ.200 కోట్లతో పనులు చేపట్టామన్నారు. గ్రామీణ రహదారుల అభివృద్ధికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. మంత్రి ఉత్తమ్ ఆదేశాలలో రెండు నియోజకవర్గాల్లో పనులు పరిశీలించామన్నారు. బ్రిడ్జిలు, కల్వర్టులతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఎదురుచూడకుండా పనులు చేయాలన్నారు. రెండు నియోజకవర్గాల్లో ప్రభుత్వ వసతి గృహాలు నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ రమేష్, జేఈ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ఆసుపత్రులు సీజ్



డీఎంహెచ్‌వో సీజ్ చేసిన శ్రీసూర్య ఆసుపత్రి

సూర్యాపేటటౌన్, జూన్ 26: జిల్లా కేంద్రంలో నిబంధనలు పాటించని నాలుగు ఆసుపత్రులను సీజ్ చేసినట్లు డీఎంహెచ్‌వో కోటా చలం తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేసి, మాట్లాడారు. నిబంధనలు పాటించని శ్రీచెస్ట్, నక్షత్ర, శ్రీసూర్య, సాయి కీర్తన ఆసుపత్రులను సీజ్ చేశామన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవన్నారు. అర్హత కలిగిన వైద్యులు లేకుండా, అగ్నిమాపక భద్రతా నియమాలు పాటించకుండా ఆసుపత్రులు నిర్వహిస్తే సీజ్ చేస్తామన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ వైద్యుల పేరు మీద నమోదైన ఆసుపత్రుల రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తామన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో అగ్నిమాపక భద్రత సర్టిఫికెట్, బయోమెడికల్, పొల్యూషన్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



వైద్యసేవలపై సిబ్బందితో సమీక్షిస్తున్న డిప్యూటీ జిల్లా వైద్యాధికారి నిరంజన్

మేళ్లచెర్వు, జూన్ 26 : వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ వైద్యాధికారి నిరంజన్ అన్నారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ డెంగీ, మలేరియా, తదితర వ్యాధుల బారిన ప్రజలు పడకుండా వైద్యసిబ్బంది తగు సూచనలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి వేణుగోపాల్‌నాయక్, హెచ్‌వో రాములు, సూపర్‌వైజర్లు రాజ్‌కుమార్, కుమారి, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: కలెక్టర్

సూర్యాపేట(కలెక్టరేట్), జూన్ 26 : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మత్తు పదార్థాలతో జీవితం నాశనమవుతుందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బుధవారం డ్రగ్స్ వ్యతిరేక దినం సందర్భంగా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌తో కలిసి జిల్లా కేంద్రంలో ర్యాలీని ప్రారంభించి, మాట్లాడారు. జిల్లాలోని యువత, విద్యార్థులకు మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అన్ని సంబంధిత శాఖల అధికారులు అవగాహన కల్పించాలన్నారు. మత్తు పదార్థాలను రవాణా చేసినా, వాటిని వినియోగించినా కఠినంగా వ్యవహరించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ముందుగా జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ నుంచి ఎంజీ రోడ్ మీదుగా మినీట్యాంక్ బండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మేక నాగేశ్వర్‌రావు, డీఎస్పీ జీ రవి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కోటా చలం, జిల్లా సంక్షేమ అధికారి జ్యోతి పద్మ, డీఐఈవో క్రిష్టయ్య, ఈఎస్ లక్ష్మానాయక్, డీపీఆర్‌వో రమేష్‌కుమార్, డాక్టర్ లకావత్ రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

పట్టణంలో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో మునిసిపల్ కమిషనర్లు, ఇంజనీర్లతో ఏర్పాటుచేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంకతో కలిసి ఆయన మాట్లాడారు.వర్షాలు పడుతున్న నేపథ్యంలో దోమలు ఉత్పత్తికాకుండా ఫాగింగ్, దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. వార్డులో నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలని, డ్రెస్‌కోడ్ తప్పక పాటించాలన్నారు. మునిసిపాలిటీల్లో ముంపు ప్రాంతాలను గుర్తించి వర్షపు, మురుగునీరు బయటకు పంపేలా అధికారులు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో చెరువులు, రిజర్వాయర్లలో నీటిని సమృద్ధిగా నిల్వ ఉంచాలని, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నారు. చెరువులు ఆక్రమణలకు గురికాకుండా పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్లు బీ శ్రీనివాస్, రమాదేవి, శ్రీనివాస్, అశోక్‌రెడ్డి, బుచ్చిబాబు, ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు

ఖైదీల కుటుంబాలకు ఆర్థిక భరోసా



ఇమాంపేటలో పెట్రోల్‌బంక్‌ను ప్రారంభిస్తున్న జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్యమిశ్రా

- జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్యమిశ్రా

సూర్యాపేట రూరల్, జూన్ 26 : జైళ్ల శాఖ ఆధ్వర్యంలో పెట్రోల్‌బంక్‌ను నిర్వహిస్తూ ఉపాధి కల్పిస్తూ, ఖైదీల్లో పరివర్తన తీసుకువస్తూనే వారి కుటుంబాలకు ఆర్థికభరోసా కల్పిస్తున్నామని జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్యమిశ్రా అన్నారు. బుధవారం సూర్యాపేట మండలం ఇమాంపేట వద్ద జైళ్లశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట, ఇతర ప్రాంత ప్రజలకు ఇక నుంచి నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందుబాటులో ఉంటుందన్నారు. కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్ మాట్లాడుతూ ప్రజలకు పెట్రోల్ బంక్ ద్వారా నాణ్యమైన డీజిల్, పెట్రోల్ అందించాలని ప్రభుత్వం జైళ్ల శాఖ ద్వారా బంక్‌లను ఏర్పాటు చేసిందన్నారు. ఖైదీలకు మంచి ప్రవర్తన ప్రధానమన్నారు. జైళ్ల శాఖ ద్వారా ఏర్పాటుచేసిన బంక్‌లతో మెరుగైన సేవలు అందజేయాలన్నారు. తప్పు చేసిన వారిని మంచి మార్గంవైపు నడిపించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. సమాజం తీరుపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ మాట్లాడుతూ జైళ్ల శాఖ ద్వారా నిర్మించిన ఈ పెట్రోల్ బంక్‌లకు ప్రజలు మద్దతు ఇవ్వాలన్నారు.

బయట పెట్రోల్ బంక్‌ల్లో జరుగుతున్న మోసాలపై చాలా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అనంతరం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సబ్ జైల్‌ను జైళ్ల డీజీ పరిశీలించారు. జైలులో రిమాండ్ ఖైదీలు తయారుచేసిన వివిధ వస్తువులను పరిశీలించారు. కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజీ ఎన్ మురళీబాబు, జిల్లా అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీ రవి, ఇండియన్ ఆయిల్ డివిజన్ రిటైల్స్ సేల్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్.శ్రీకాంత్, జిల్లా సబ్‌జైలు అధికారి ఆర్.శోభన్‌బాబు, సూపరింటెండెంట్ సుధాకర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

రెండేళ్లప్రాయం... జ్ఞాపకశక్తి అపారం

- ఇండియా బుక్ ఆఫ్ రికార్డు అందుకున్న చిన్నారి



ఉపాసన సాధించిన ఇండియా బుక్ ఆఫ్ రికార్డు అవార్డు

నేరేడుచర్ల, జూన్ 26: రెండేళ్ల ప్రాయంలోనే జ్ఞాపకశక్తిలో ఓ చిన్నారి అరుదైన రికార్డు సాధించింది. నేరేడుచర్లలో నివాసం ఉంటున్న ఉపాసన సూపర్ టాలెంటెడ్ కిడ్ అవార్డు అందుకుంది. దీనితో పాటు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు సొంతం చేసుకుంది. సూర్యాపేట జిల్లా నేరేడుచర్లకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు గుండా రామ్మూర్తి కుమార్తె అనూష, అల్లుడు శివప్రసాద్‌ల కుమార్తె ఉపాసన అరుదైన రికార్డులు సొంతం చేసుకుంది. వృత్తి రీత్యా శివప్రసాద్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కాగా, అమెరికాలో స్థిరపడ్డారు. ఆయన కుమార్తె ఉపాసన తాత రామ్మూర్తి వద్దే పెరిగింది. రెండు సంవత్సరాల నాలుగు నెలల వయసున్న ఉపాసన 50మంది స్వాతంత్య్ర సమరయోధులను గుర్తించి ఈ నెల 15వ తేదీన ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో పేరు సంపాదించింది. మల్టిపుల్ ఆక్టివిటీస్‌లో గుర్తింపు పొంది మల్టిపుల్ అవార్డును అందుకుని ఏప్రిల్ నెలలో తెలుగు బుక్ఆఫ్ రికార్డు అచీవర్‌గా పేరు పొందింది. భారత దేశ పటంలోని 15 రాష్ట్రాలను గుర్తించి, జంతువులు, పండ్లు, కూరగాయలు, 45 ముక్కల జిగ్సా బ్రిక్స్ పజిల్‌ను పరిష్కరించింది. తాము చేసిన వీడియో కార్యక్రమ నిర్వాహకులకు పంపితే వారు ఆన్‌లైన్‌లో ప్రతిభను పరీక్షిస్తారు. అడవి జంతువులు, వ్యవసాయ జంతువులు, పక్షులు, మంచు జంతువులు, సముద్ర జంతువులు, పువ్వుల ఆకారాలు ఇలా 50 రకాల పజిల్స్‌ను పూరించి మార్చి నెలలో అంతర్జాతీయ బుక్ ఆఫ్ రికార్డులో, వరల్డ్ బుక్ ఆఫ్ ఎక్సలెన్స్ పేరు సంపాదించి సూపర్ టాలెంటెడ్ కిడ్‌గా ఎంపికైంది. కుమార్తె ఉపాసన ఈ విజయం సాధించడంపై తల్లి అనూష విలేకరులతో ఆనందాన్ని పంచుకుంది. తండ్రి రామ్మూర్తి చిన్నప్పటి నుంచి ఉపాసనకు అన్ని విషయాలు గుర్తించేలా బోధించరని తెలిపింది. ఉపాసన అవార్డులు సాధించడంపై తల్లిదండ్రులు, బంధువులు, కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జీపీ కార్మికుల వేతనాలు విడుదల చేయాలి

సూర్యాపేట(కలెక్టరేట్), జూన్ 26: గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలను విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం యూనియన్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కార్మికులకు నెల నెలా వేతనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నెలకు రూ.9500 వేతనం అందిస్తూ సమయపాలన లేకుండా రోజు 12గంటలు పనిచేయిస్తున్నారని ఆరోపించారు. అనంతరం వినతిపత్రాన్ని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ధనియాకుల శ్రీనివాస్, రవిచంద్ర, భిక్షం, రాంబాబు, గుర్వమ్మ, వెంకటమ్మ, దయానంద్ పాల్గొన్నారు.

కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కామళ్ల నవీన్, గంట నాగయ్య డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కే సైదులు, నర్సింహారావు, మధు, లింగయ్య, వీరయ్య పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

డ్రిల్లింగ్ మిషన్‌తో మోది హత్య

● ఎలక్ట్రీషియన్ హత్యకేసును ఛేదించిన పోలీసులు

● వివరాలు వెల్లడించిన డీఎస్పీ రాజశేఖరరాజు

మిర్యాలగూడ అర్బన్, జూన్ 26: నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో ఈ నెల 23న జరిగిన హత్య మిస్టరీని పోలీసులు ఛేదించారు. పని విషయంలో జరిగిన ఘర్షణ హత్యకు దారితీయగా, తోటి కార్మికుడే డ్రిల్లింగ్ మిషన్‌తో హత్య చేసినట్లు డీఎస్పీ రాజశేఖరరాజు వెల్లడించారు. బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో కేసు వివరాలను డీఎస్పీ వివరించారు. నాగార్జునసాగర్ విజయపురికాలనీ పరిధిలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో నూతన భవన నిర్మాణంలో స్థానిక హిల్‌కాలనీకి చెందిన సయ్యద్ రెహమాన్ ఎలక్ట్రీషియన్ పనిచేస్తున్నాడు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి పరిధిలోని ఇన్నీస్‌పేటకు చెందిన సిరావు నాగబాలసాయి రెడ్డి భవనం పెయింటింగ్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. అయితే పనివిషయంలో సయ్యద్ రెహమాన్, నాగబాలసాయిరెడ్డి మధ్య ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నం వివాదం జరిగింది. నాగబాలసాయిరెడ్డి అదేరోజు రాత్రి 10 గంటల సమయంలో పనిచేసేందుకు స్కూల్ బిల్డింగ్‌లోకి వచ్చాడు. రాత్రి వేళలో నాగబాలసాయిరెడ్డి పెయింటింగ్ వర్క్ చేస్తున్నాడని కన్‌స్ట్రక్షన్ యజమాని నాగేశ్వరరావుకు సయ్యద్ రెహమాన్ ఫిర్యాదు చేశాడు. స్పందించిన ఆయన తన పని తాను చేసుకుంటాడు నీవు పడుకో.. అని చెప్పడంతో రెహమాన్ నిద్రపోయాడు. తనపై ఫిర్యాదు చేస్తున్న సయ్యద్ రెహమాన్‌పై కక్ష పెంచుకున్న నాగబాలసాయిరెడ్డి అతడిని హతమార్చేందుకు సిద్ధపడ్డాడు. గదిలో ఉన్న ఎలక్ట్రికల్ డ్రిల్లింగ్ మిషన్ రాడ్డుతో రెహమాన్ తలపై విచక్షణ రహితంగా దాడిచేసి హతమార్చాడు. అనంతరం మృతదేహాన్ని స్కూల్ ఆవరణలో గుంతతవ్వి అందులో పూడ్చి అక్కడినుంచి పరారయ్యాడు. ఈ నెల 23వ తేదీన అక్కడకు వచ్చిన యజమాని నాగేశ్వరరావుకు తనతో మాట్లాడిన ఇద్దరు వ్యక్తులు కనిపించకపోవడం, పై అంతస్తులో రక్తపు మరకలు ఉండటాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదుచేశాడు. దీంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించిన విజయపురి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు మొదలుపెట్టారు. డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి జరిపిన సోదాలో మృతదేహాన్ని పూడ్చిపెట్టిన ప్రదేశాన్ని గుర్తించారు. దీంతో హత్య కేసు మిస్టరీగా మారడంతో పోలీసులు మూడుబృందాలుగా ఏర్పడి రంగంలోకి దిగారు. నిందితుడి ఆచూకీ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నిందితుడు పెద్దవూర వై జంక్షన్‌వద్ద ఉన్నట్లుగా గుర్తించి బుధవారం అతడిని అదుపులోకి తీసుకొని విచారించారు. పోలీసుల విచారణలో నిందితుడు తన నేరాన్ని అంగీకరించినట్లు డీఎస్పీ తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

దీంతో విజయపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ఇద్దరు వ్యక్తుల మిస్సింగ్ కేసులో ఓ వ్యక్తి హత్యకు గురికాగా, మరో వ్యక్తి నిందితుడిగా పట్టుబడినట్లు డీఎస్పీ తెలిపారు. పంచనామా నిర్వహించి నిందితుడిపై హత్యానేరం కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు. కేసు మిస్టరీని ఛేదించడంలో కృషి చేసిన సాగర్ సీఐ బీసన్న, విజయపురి టౌన్ ఎస్ఐ నారాయణరెడ్డి, సిబ్బంది హరిలాల్, శ్రీకాంత్, గురునాథం పోలీస్ బృందాలను డీఎస్పీ అభినందించారు.

ప్రాణం తీసిన అప్పు

● అప్పుల వారి వేధింపులతో వ్యక్తి ఆత్మహత్య

నాగార్జునసాగర్, జూన్ 26: కుటుంబ అవసరాలు, వ్యాపారం కోసం బంధువుల వద్ద రూ. కోటికిపైగా అప్పు చేశాడు. అప్పు తీర్చాలని బంధువులు ఒత్తిడి చేయడం ప్రారంభించారు. ఏమి చేయాలో అర్థం కాలేదు.. అప్పులు తీర్చే మార్గం లేక ఉరివేసుకుని తనువు చాలించాడు. బుధవారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని హిల్‌కాలనీలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎరుకల సామాజిక వర్గానికి చెందిన కండెల శంకరయ్య(35) నాగార్జునసాగర్‌లోని హిల్‌కాలనీలో నివాసం ఉంటాడు. పందుల వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడు. పందులు కొనుగోలు చేసి విక్రయించేవాడు. ఈ క్రమంలో సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని తన చెల్లెలి భర్త(బావ), బావ సోదరి(వదిన) వద్ద రెండేళ్లలో రూ.కోటి తీసుకున్నాడు. తమకు డబ్బులు కావాలని వారు ఒత్తిడి చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో జూలై 5వ తేదీలోపు అప్పు తిరిగి ఇవ్వాలని బంధువులు ఒత్తిడి చేస్తున్నారు. పది రోజులుగా ఈ పంచాయితీ నడుస్తోంది. అయితే ఈ నెల 24వ తేదీ సోమవారం శంకరయ్యను అప్పు ఇచ్చిన బంధువులు ఏపీలోని మాచర్లలో పట్టుకుని, అక్కడినుంచి గజ్వేల్‌కు తీసుకెళ్లారు. అక్కడ శంకరయ్యపై అతని బంధువులు దాడి చేసినట్లు కుటుంబసభ్యులు ఆరోపించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శంకరయ్య మంగళవారం రాత్రి హిల్‌కాలనీలోని తన ఇంటికి చేరుకున్నాడు. తీవ్ర మనస్తాపానికి గురైన శంకరయ్య సూసైడ్ నోట్ రాసి ఇంట్లో పెట్టి గదిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. బుధవారం ఉదయం భార్య ఉదయం ఆరు గంటల సమయంలో నిద్రలేచి చూసే సరికి శంకరయ్య ఫ్యాన్‌కు ఉరివేసుకొని వేలాడుతుండంతో ఆమె వెంటనే చుట్టు పక్కల ఉన్న బంధువులను పిలిచింది. శంకరయ్యను కిందకు దించగా అప్పటికే మృతిచెందాడు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న సూసైడ్ నోట్, శంకరయ్య(ఫైల్)

సూసైడ్ నోట్ స్వాధీనం

పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇంట్లో లభించిన సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ వడ్డీ వ్యాపారం చేస్తూ తనను వేధిస్తున్నారని, కోటి రూపాయల అప్పుకు మరో కోటి రూపాయలు వసూలుచేస్తూ దందా చేస్తున్నారని లేఖలో రాసి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రికి తరలించారు. శంకరయ్య సోదరుడు నారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. శంకరయ్యకు భార్య, కుమార్తె ఉన్నారు.

ఒడిశా టూ షోలాపూర్ గంజాయి రవాణా

● అంతర్రాష్ట్ర మాదక ద్రవ్యాల ముఠా అరెస్టు

● సీట్ల కింద భాగంలో గంజాయి... వాటిపై వస్త్రం

చౌటుప్పల్ రూరల్, జూన్ 26: ఒడిశా నుంచి షోలాపూర్‌కు గంజాయి అక్రమ రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర మాదక ద్రవ్యాల ముఠాను రాచకొండ ఎల్‌బీనగర్ జోన్ ఎస్‌వోటీ, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పోలీసులు అరెస్టుచేశారు. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో 284కిలోల ఎండు గంజాయి, రెండు కార్లు, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఈ కేసు వివరాలను రాచకొండ సీపీ తరుణ్‌జోషి రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో వెల్లడించారు. మహారాష్ట్రలోని షోలాపూర్‌కు చెందిన బోసాలే అబమశ్చీంద్ర(29), అవినాష్ శివాజీ రాథోడ్ (19), సిద్ధ రామేశ్వర్ పూజారి(27) డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. అజయ్‌రాథోడ్ అనే మిత్రుడితో కలిసి గతంలో గంజాయి రవాణాతో డబ్బులు సంపాదించారు. ఈ క్రమంలో ఒడిశా నుంచి షోలాపూర్‌కు గంజాయిని తరలించేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ నెల 23వ తేదీన పై నలుగురు ఒడిశాలోని అల్లూరి కోటలో ఉన్న గంజాయి విక్రయదారుడు తేజ వద్ద గంజాయి కొనుగోలు చేశాడు. అజయ్‌రాథోడ్ అక్కడే ఉండి ముగ్గురికి ఇన్నోవా, స్విఫ్ట్ డిజైర్ కార్లను సమకూర్చాడు. రెండు కార్లలో 140 బ్యాగుల ఎండు గంజాయిని తీసుకుని బయలుదేరారు. సీట్ల కింద భాగంలో, గంజాయిని అమర్చి, వాటిపై వస్త్రం కప్పారు. మహారాష్ట్రకు చెందిన ఇన్నోవా కారు నెంబర్ ప్లేటును ఏపీ నెంబర్ ప్లేటు నకిలీది ఏర్పాటు చేసుకుని ఈ నెల 24వ తేదీ రాత్రి ఒడిశా నుంచి విజయవాడ, సూర్యాపేట మీదుగా షోలాపూర్‌కు బయలుదేరారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ ఎస్వోటీ, చౌటుప్పల్ పోలీసులు ఈ నెల 25వ తేదీన పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఇన్నోవా వాహనాన్ని తనిఖీ చేశారు. ముగ్గురు నిందితులను అదుపులో తీసుకుని వారి నుంచి రూ.80.30లక్షల విలువైన గంజాయి, కార్లు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు. తేజ, రాథోడ్‌లు పరారీలో ఉన్నట్లు రాచకొండ సీపీ తరుణ్ జోషి తెలిపారు.


పంతంగి టోల్‌గేటు వద్ద గంజాయి ప్యాకెట్లతో పట్టుబడ్డ కారు


సోనియాతో ఉత్తమ్ భేటీ

డిల్లీలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీతో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి బుధవారం భేటీ అయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు సాధించడంపై ఆయన అభినందనలు తెలిపారు. ప్రతిపక్ష నాయకుడిగా రాహుల్ గాంధీ గురుతర బాధ్యతలు తీసుకున్నందుకు సంతోషాన్ని వ్యక్తం చేశారు.



గుట్టలో శాస్త్రోక్తంగా నిత్య పూజలు

భువనగిరి అర్బన్, జూన్ 26: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య కైంకర్యాలు పాంచారాత్రాగమశాస్త్ర రీతిలో వైభవంగా నిర్వహించారు. కొండపైన శివాలయంలో, పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 19,74,929 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. ఈ నెల 27నుంచి స్వామివారి సన్నిధిలో శ్రీవినాయక నాట్యమండలి సురభి నాటకాల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఈవో భాస్కరరావు తెలిపారు. యాదాద్రీశుడిని దర్శించుకున్న భక్తులు సమర్పించిన మొక్కు కానుకలను గురువారం లెక్కించనున్నారు. కొండకింద వ్రత మండపంలో లెక్కింపు నిర్వహించనున్నట్లు ఈవో భాస్కరరావు తెలిపారు.



పోలీసులు వేధిస్తున్నారంటూ

ఆత్మహత్యాయత్నం

వాడపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట ఘటన


సైదాను ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

దామరచర్ల, జూన్ 26: పోలీసులు తనను వేధిస్తున్నారంటూ నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట తాజా మాజీ సర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దామరచర్ల మండలం గణేష్‌పహాడ్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రమావత్ జ్యోతి భర్త సైదా బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నాడు. పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా మే 13వ తేదీన అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు తనపై దాడి చేసి గాయపరిచారని అదేరోజు సైదా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. ఫిర్యాదుపై పోలీసులు చర్యలు తీసుకున్నారో లేదో తెలుసుకునేందుకు సైదా బుధవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. ఎస్ఐ లేరని తెలుసుకున్న అనంతరం బయటకు వెళ్లిన సైదా పోలీస్‌స్టేషన్ వెనుకవైపు ఉన్న రోడ్డు వద్ద ఓ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. అందులో తనపై దాడి చేసిన వారి వివరాలతో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని, పైగా తనపైనే కేసు నమోదు చేసి వేధింపులకు గురిచేస్తున్నాడని, తాను ఆత్మహత్య చేసుకుంటానని క్రిమిసంహారక మందు డబ్బాను చూపించాడు. ఈ వీడియోను పలు సోషల్‌మీడియా గ్రూపుల్లో పోస్టు చేసి ఆ వెంటనే పోలీస్‌స్టేషన్ ఎదుట క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన స్థానికులు పోలీస్‌స్టేషన్‌లోని సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే వారు పోలీస్ వాహనంలో సైదాను మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇదిలా ఉండగా సైదా పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన సమయంలో ఎస్ఐ ఇరుగు రవి మిర్యాలగూడకు ట్రైనింగ్ నిమిత్తం వెళ్లాడు.

సైదావి తప్పుడు ఆరోపణలు : ఎస్ఐ ఇరుగు రవి

పోలీసులపై సైదా చేస్తున్న ఆరోపణలు నిరాధారమని ఎస్ఐ తెలిపారు. గతంలో గ్రామంలో నీటి సరఫరా చేసే వ్యక్తిని సైదా దూషించడంతో అతడు దాడిచేశాడని, ఆ ఘటనలో సైదాకు స్వల్పగాయమైందన్నారు. ఈ ఘటనపై ఇరువురు ఫిర్యాదు చేసుకోగా, దూషించినందుకు సైదాపై, దాడి చేసినందుకు ఆ వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. సైదాను ఏ రోజూ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించడం కానీ, వేధించడం కానీ జరగలేదన్నారు. గ్రామంలో నీటి సమస్యపై చర్చిస్తున్న సమయంలో ఘర్షణ జరిగిందని, సైదా గొడవకు సంబంధించి ఏ పార్టీతోనూ సంబంధం లేదన్నారు.

గురుకుల అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలి

» సర్కార్‌కు వారి బాధలు కనిపించట్లేదా?: హరీశ్‌రావు

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలే పరమావధిగా నడుస్తున్న ప్రజా ప్రభుత్వానికి గురుకుల టీచర్ పోస్టుల అభ్యర్థుల బాధలు కనిపించకపోవడం బాధాకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంత్రులు, అధికారులను కలిసి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. సీఎం ఇంటి ముందు మోకాళ్ల మీద నిలబడి అభ్యర్థించినా గురుకుల అభ్యర్థుల మొర ఆలకించకపోవడం శోచనీయమన్నారు. బుధవారం ఆయన 'ఎక్స్' వేదికగా గురుకుల అభ్యర్థుల నిరసనకు మద్దతు ప్రకటించారు. వారి సమస్యలను తక్షణం పరిష్కరించాలని బీఆర్ఎస్ తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోస్టులు బ్యాక్‌లాగ్ కాకుండా రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అన్నింటినీ భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా, కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీలో నెలకొన్న ఇబ్బందులను పరిష్కరించేందుకు జీవో46ను సవరించాలని బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. జీవో46కు సంబధించిన కేసు విచారణను అడ్వకేట్ జనరల్ ఉద్దేశపూర్వకంగా వాయిదా వేయించారని ఆరోపించారు.

కేసీఆర్ భూముల కోసమే అలైన్‌మెంట్ మార్చారు

» 'ఆర్ఆర్ఆర్' భూనిర్వాసితుల ఐక్య వేదిక

గజ్వేల్, జూన్ 26: తన భూముల విలువ పెంచుకునేందుకే మాజీ సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు రీజినల్ రింగ్‌రోడ్డు (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్‌ను మార్చారని భూనిర్వాసితుల ఐక్య వేదిక నేతలు మండిపడ్డారు. ఈ అలైన్‌మెంట్‌ను మార్చాల్సిందేనంటూ వారు డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్‌లో ఆర్ఆర్ఆర్ భూనిర్వాసితులు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. అనంతరం గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే తమ భూముల నుంచి కొండపోచమ్మ సాగర్ కాలువలు వెళ్లాయని వెళ్లాయని, ఇప్పుడు రీజినల్ రింగ్ రోడ్డు వెళ్తే.. ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములకు ఆర్డీవో ఎకరాకు రూ.7.50లక్షలు మాత్రమే ఇస్తామంటున్నారని, ఆ డబ్బుతో ఏం వస్తుందని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల ముందు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసినప్పుడు తమకు న్యాయం చేస్తామన్నారని, ఇప్పుడు టెండర్లను పిలుస్తున్నట్లు ప్రకటించడం సరికాదని ఆక్షేపించారు. ఇప్పటికే ఉన్న చిట్యాల-సంగారెడ్డి 161 జాతీయ రహదారినే రీజినల్ రింగ్ రోడ్డుగా మార్చాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీకి షరతులు..వెన్నుపోటే: కిసాన్‌మోర్చా

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రారంభ, ముగింపు తేదీలు అంటూ షరతులు విధించడం.. రైతులకు వెన్నుపోటు పొడవడమేనని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.2లక్షల రుణమాఫీపై తుక్కుగూడ సభలో రాహుల్ గాంధీతో హామీ ఇప్పించారని, దాన్ని అమలు చేయకపోతే ప్రజలే ఆ పార్టీ నేతల తుక్కు రేగ్గొడతారని హెచ్చరించారు. ఖరీఫ్‌లో పెట్టుబడికి డబ్బులు లేక రైతులు అల్లాడుతుంటే... అభిప్రాయ సేకరణ అంటూ ఆటలాడుతున్నారని మండిపడ్డారు. షరతులు లేకుండా రుణమాఫీ అమలు చేయాలని, లేదంటే బీజేపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

పెన్షనర్ల సమస్యలపై ఉద్యమిస్తాం: జేఏసీ

సమస్యల పరిష్కారం కోసం జూలై నుంచి ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ వెల్లడించింది. ఈ మేరకు బుధవారం సీఎస్‌కు నోటీసు అందజేసినట్లు జేఏసీ ఛైర్మన్ కె.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి శుభాకర్‌రావు తెలిపారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి అనేక సందర్భాల్లో వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఈ మేరకు జూలై 15న అన్ని జిల్లా కేంద్రాల్లో సమావేశాలు పెట్టి కలెక్టర్లకు వినతిపత్రాలు ఇస్తామని వెల్లడించారు. వేలాది మంది పెన్షనర్లతో జూలై 30న ఇందిరాపార్కు వద్ద మౌనదీక్ష చేస్తామని తెలిపారు.

అవినీతికి పాల్పడలేదని పొన్నం చెప్పగలరా?

» మంత్రుల అవినీతిని బ్లాక్ బుక్‌లో నమోదు చేస్తున్నాం

» బీఆర్ఎస్ మళ్లీ వచ్చాక ఎవర్నీ వదిలిపెట్టం: కౌశిక్‌రెడ్డి

బంజారాహిల్స్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ దేవుడిపై ప్రమాణం చేస్తారా? అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నిలదీశారు. ఆయన ప్రమాణం చేస్తే క్షమాపణ చెప్పేందుకు తాను సిద్ధమని ప్రకటించారు. ఫ్లై యాష్ తరలింపులో మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.100 కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారని ఆరోపించిన కౌశిక్‌రెడ్డి.. జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయానికి వస్తే నిరూపిస్తానని సవాల్ విసిరారు. ఈ మేరకు బుధవారం టీటీడీ ఆలయానికి వచ్చిన కౌశిక్‌రెడ్డి.. అక్కడ మీడియాతో మాట్లాడారు. తన ఆరోపణలపై మంత్రి పొన్నం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. లీగల్ నోటీసులు పంపిస్తే భయపడేది లేదని స్పష్టం చేశారు. ఫ్లై యాష్ లారీలను తానే స్వయంగా హుజూరాబాద్‌లో పట్టుకున్నానని, వే బ్రిడ్జికి తరలించి తూకం వేస్తే 76 టన్నులు ఫైగా తీసుకెళ్తున్నట్లు తేలిందన్నారు. నిబంధనల ప్రకారం 16 టైర్ల లారీలో 36 టన్నులు మాత్రమే తీసుకువెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఈ వ్యవహారంలో రవాణా శాఖ మంత్రికి సంబంధం లేదా?అని ప్రశ్నించారు. మంత్రుల అవినీతిని బ్లాక్ బుక్‌లో నమోదు చేస్తున్నట్టు, మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఎవరినీ వదిలేది లేదని హెచ్చరించారు.



ప్రధాని మోదీని కలిసిన బండారు దత్తాత్రేయ, కుటుంబ సభ్యులు

మోదీకి గవర్నర్ దత్తాత్రేయ అభినందనలు

న్యూఢిల్లీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోదీకి హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అభినందనలు తెలిపారు. బుధవారం ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ప్రధాని మోదీని దత్తాత్రేయ కుటుంబ సభ్యులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కృష్ణభగవానుని 'విరాట్ స్వరూప్' విగ్రహాన్ని ప్రధానికి బహూకరించారు. గవర్నర్ సతీమణి బండారు వసంత, కుమార్తె బండారు విజయలక్ష్మి, అల్లుడు, డాక్టర్ బి.జిగ్నేష్ రెడ్డి, బండారు శివశంకర్, మనవరాళ్ల యశోధర రెడ్డి, వేదాంషి రెడ్డిలు మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. యశోధర, వేదాంషి ప్రధాని కోసం రెండు పాటలు పాడగా.. మోదీ వారిని ప్రత్యేకంగా అభినందించి, ఆశీర్వదించారు. మరోవైపు.. ప్రధానిమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి కలిశారు.

మేడిగడ్డ డిజైన్ ఒకటైతే..నిర్మాణం మరోరకంగా

» తుమ్మిడి హెట్టిని పునఃపరిశీలించాలి: కోదండరాం

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ ప్రాజెక్టు డిజైన్ ఒకటైతే నిర్మాణం మరోరకంగా చేశారని, అందుకే అది కుంగిందని టీజేఎస్ అధినేత కోదండరాం అన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యత లేదని, నిర్వహణ కూడా సరిగా లేదని ఆరోపించారు. ఈ విషయాలను డ్యామ్ సేఫ్టీ అధికారులే వెల్లడించారని చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ సుజల స్రవంతి పేరుతో కాంగ్రెస్ హయాంలో తుమ్మిడిహెట్టి వద్ద చేపట్టిన ప్రాజెక్టుకు సంబంధించి రూ.800కోట్ల ఖర్చుతో కాల్వల నిర్మాణం చేపట్టారని గుర్తుచేశారు. తుమ్మిడి హెట్టిని పునఃపరిశీలన చేసి కొంతమేరకు పనులు చేసినట్లయితే.. అప్పుడు చేపట్టిన కాల్వల ద్వారా నీటిని తీసుకొచ్చే అవకాశం ఉందన్నారు. మేడిగడ్డ తప్పిదానికి బాధ్యులపై చర్యలు తీసుకుని శిక్షలు వేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్తు కొనుగోళ్లకు సంబంధించి విచారణ కమిషన్ వేయాలని అడిగిందే బీఆర్ఎస్ వాళ్లన్నారు. ఇప్పుడు కమిషన్‌కు అర్హత లేదని చెప్పి.. వాస్తవాలు తెలియకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రైల్‌రోకో కేసులో కేసీఆర్‌తో పాటు తానూ ఉన్నానని గుర్తు చేసిన కోదండరాం.. ఉద్యమకారులందరిపై కేసులు తొలగించాలని కోరాల్సింది పోయి.. ఆయనపైన ఉన్న కేసులే తొలగించాలనడం విడ్డూరమన్నారు.

స్పీకర్.. అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు

» మెయిల్, స్పీడ్ పోస్టులో ఫిర్యాదులు పంపాం

» పోచారం, సంజయ్‌ను అనర్హులుగా ప్రకటించాలి

» ఇళ్లకు వెళ్లి కండువాలు కప్పడం సిగ్గుచేటు: జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ తరఫున గెలిచిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరడం చట్ట వ్యతిరేకమని, వారిని అనర్హులుగా ప్రకటించాలని ఎమ్మెల్యే జి.జదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేద్దామంటే ఆయన అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆరోపించారు. ఆ ఇద్దరిపై అనర్హత వేటువేయాలని కోరుతూ స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శికి వేర్వేరుగా ఈ మెయిల్, స్పీడ్ పోస్టు ద్వారా ఫిర్యాదులు పంపామన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వారిద్దరిపై స్పీకర్ చర్యలు తీసుకోకుంటే న్యాయపరంగా ముందుకెళ్తామన్నారు. పాంచ్‌న్యాయ్‌లో ఫిరాయింపులను ఆమోదించబోమని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఎలా చేర్చుకుంటోందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో చట్టప్రకారం రెండు వంతుల మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరారని గుర్తు చేశారు. తమ పార్టీలో చేరిన వారంతా కేసీఆర్ వద్దకు వచ్చి కండువాలు కప్పుకొన్నారని, కానీ.. ఇప్పుడు రేవంత్ ఇంటింటికి తిరిగి కండువాలు కప్పడం సిగ్గుచేటన్నారు.

ఫిరాయింపులపై కేటీఆర్ మొసలి కన్నీరు

» త్వరలోనే బీఆర్ఎస్ నుంచి మరిన్ని చేరికలు: విప్ ఆది శ్రీనివాస్



హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపులపైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. మొసలి కన్నీరు కారుస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపించారు. గతంలో టీడీపీ నుంచి గెలిచిన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను బీఆర్ఎస్‌లో చేర్చుకుని మంత్రిని చేసినప్పుడు కేసీఆర్‌ను ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. 2019లో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నప్పుడు ప్రజాస్వామ్యం ఎటు పోయిందో కేటీఆర్ చెప్పాలన్నారు. సీఎల్పీ మీడియా హాల్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కేసీఆర్.. తన ఫామ్ హౌస్‌లో వీడ్కోలు పార్టీ ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ మునుగుతున్న నావ అని, రేవంత్‌రెడ్డి అనే తుఫానులో ఆ పార్టీ కొట్టుకుపోవడం ఖాయమని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలను హీనాతి హీనంగా చూసిన చరిత్ర కేసీఆర్‌ది అని ధ్వజమెత్తారు. త్వరలోనే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మరిన్ని చేరికలుంటాయని స్పష్టం చేశారు. ఆ పార్టీలో మిగిలేది నలుగురేనన్నారు. కాగా, దివ్యాంగులకు ఉన్నత విద్యలో 5శాతం రిజర్వేషన్ కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి.. వారి ఆత్మబంధువుగా మారారని టీపీసీసీ దివ్యాంగుల సెల్ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య కొనియాడారు.

మెట్టు దిగిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కాంగ్రెస్సే ముఖ్యమని వెల్లడి.. కేసీ వేణుగోపాల్, దీపాదాస్ మున్షీతో భేటీ

» ఫలించిన అధిష్ఠానం బుజ్జగింపులు

» కాంగ్రెస్‌తోనే జాతి ఐక్యత: జీవన్ రెడ్డి

» పార్టీలో మొదటి నుంచి ఉన్నవారికి ప్రాధాన్యం: దీపాదాస్ మున్షీ

న్యూఢిల్లీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వీడడం ఖాయమన్న వార్తలకు ఫుల్‌స్టాప్ పడింది. తనకు సమాచారం ఇవ్వకుండానే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని తీవ్ర మనస్తాపం చెందిన జీవన్‌రెడ్డి ఎట్టకేలకు మెట్టు దిగారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్నవాళ్ల అభిప్రాయాల ఆధారంగానే చేరికలు, ఇతర విషయాలలో ముందుకెళతామని అధిష్ఠానం హామీ ఇవ్వడంతో ఆయన శాంతించారు. రంగంలోకి దిగిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పరిస్థితిని చక్కబెట్టారు. మూడ్రోజులుగా అసంతృప్తితో రగిలిపోతూ పార్టీని వీడేందుకు సిద్ధపడిన జీవన్‌రెడ్డికి పార్టీ అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చింది. కేసీ వేణుగోపాల్ ఫోన్ చేసి ఢిల్లీ రావాలని కోరడంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి బుధవారం సాయంత్రం జీవన్ రెడ్డి ఢిల్లీకి చేరుకున్నారు. తెలంగాణ భవన్‌లోని శబరి బ్లాక్‌లో జీవన్‌రెడ్డితో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అరగంటపాటు చర్చలు జరిపారు. అయినా జీవన్‌రెడ్డి వెనక్కి తగ్గలేదు. ఆ తర్వాత ముగ్గురూ కలిసి కేసీ వేణుగోపాల్ ఇంటికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి వెళ్లినా తాను పార్టీని నమ్ముకుని ఉన్నానని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి చెప్పినట్లు తెలిసింది. కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే సంజయ్ చేరికపై అసంతృప్తి వ్యక్తం చేశారని సమాచారం. జీవన్‌రెడ్డిని బుజ్జగించిన పెద్దలు.. పార్టీ అండగా ఉంటుందని, దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పుంజుకుంటున్న సమయంలో పార్టీని వీడవద్దని కోరినట్లు తెలిసింది. దీంతో చల్లబడిన జీవన్‌రెడ్డి సమ్మతించారు. భేటీ అనంతరం బయటికి వచ్చాక జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తనకు కాంగ్రెస్సే ముఖ్యమంటూ వెల్లడించారు. కార్యకర్తలను కాపాడుకోవడం ఏ పార్టీకైనా ముఖ్యమని అన్నారు. కార్యకర్తల ఆత్మగౌరవాన్ని దృష్టిలో పెట్టుకుని, వారి ఆలోచనలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకోవాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మెరుగైన ఫలితాలు వచ్చాయని, లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, జాతి ఐక్యతను కాంగ్రెస్ కాపాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను కాంగ్రెస్ నెరవేరుస్తుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో అమలుకాని పథకాలను తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఏకకాలంలో రూ.31 వేల కోట్లతో రుణమాఫీకి కాంగ్రెస్ సంకల్పించదని ఆయన హర్షం వ్యక్తం చేశారు.



ఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

ఫిరాయింపులపై బీఆర్ఎస్ మాట్లాడటమా?: దుద్దిళ్ల

పార్టీలో సీనియర్ నేత అయిన జీవన్‌రెడ్డిని కించపరచడం తమ ఉద్దేశ్యం పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ అన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే చేరికను అగౌరవంగా, అమర్యాదగా భావించి ఉండవచ్చన్నారు. పార్టీలో చేరికలకు తలుపులు తెరిచే ఉన్నాయన్నారు. కాంగ్రెస్‌లో మొదటి నుంచి ఉన్నవారికి ప్రాధాన్యం తగ్గకుండా చూస్తామని స్పష్టం చేశారు. ఏ నిర్ణయం తీసుకున్నా కేసీ వేణుగోపాల్‌తో చర్చించే తీసుకుంటామని చెప్పారు. మీడియా అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ.. టీపీసీసీ అధ్యక్ష పదవిపై నిర్ణయం అధిష్ఠానానిదేనని ఆమె పేర్కొన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతల విమర్శలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ఫిరాయింపులపై ప్రశ్నించేందుకు ఆ పార్టీకి కాస్త అయినా నైతికత ఉండాలని మండిపడ్డారు. అధికారంలో ఉండగా కాంగ్రెస్‌ను అంతం చేయాలని ప్రయత్నించారన్నారు. ఇపుడు బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య మార్పు ఎలా ఉందో స్పష్టంగా కనపడుతోందని ఆయన పేర్కొన్నారు.

డ్రగ్స్‌కు బానిసైతే భవిష్యత్తు అంధకారం

» యువత వ్యసనాలు వీడి ఉన్నత లక్ష్యాలు చేరాలి: జూపల్లి

» మాదక ద్రవ్యాల మత్తులోనే లైంగిక దాడులు, హత్యలు: సీతక్క

మాదాపూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు బానిసైతే ఉజ్వల భవిష్యత్తు అంధకారమవుతుందని, యువత వ్యసనాలను వీడి లక్ష్యం వైపు అడుగులేసి ఉన్నత స్థాయికి చేరుకుని భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహించిన 'డ్రగ్స్ నియంత్రణ.. అక్రమ రవాణాపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మంత్రి సీతక్కతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. మానవ జన్మ ఎంతో ఉత్తమమైనదని.. కానీ చెడు వ్యసనాల కారణంగా అనారోగ్యం పాలైన చాలామంది అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచానికి ఉగ్రవాదం తర్వాత అంతటి పెనుసవాలుగా డ్రగ్స్ వినియోగం మారిందన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు కూడా డ్రగ్స్ చేరడం ఆందోళన కలిగించే విషయమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఎంతో డ్రగ్ పెడర్లతో పాటు వినియోగిస్తున్న వారినీ అదుపులోకి తీసుకుని కేసులు పెట్టామని వెల్లడించారు. సీతక్క మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల మాఫియా ప్రపంచాన్ని గడగడలాడించి, కోట్లు కొల్లగొడుతోందన్నారు. మాదకద్రవ్యాల మత్తులో లైంగిక దాడులు, హత్యలు చేస్తున్నారని, పెద్దపల్లిలో చిన్నారిపై లైంగికదాడి హత్య ఘటన మనసును కలవరపెట్టిందన్నారు. డ్రగ్స్ అనర్థాలపై మెగాస్టార్ చిరంజీవి సందేశంతో కూడిన వీడియో, పాటను మంత్రులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీజీపీ రవి గుప్తా, మాజీ క్రికెటర్ మిథాలీరాజ్, సినీ నటులు సుమన్, తేజా సజ్జా, గాయకుడు రామ్ మిరియాల, అధికారులు పాల్గొన్నారు.

ఐటీఐఆర్ మంజూరు చేసే వరకు మాట్లాడుతూనే ఉంటా

» కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను కలుస్తా

» ప్రతిపక్షంగా మా బాధ్యత మేము నిర్వహిస్తాం

» కాంగ్రెస్ ఐటీఐఆర్ మంజూరు చేసినప్పుడు.. రఘునందన్ రావు బీఆర్ఎస్‌లో ఉన్నడు

» నాకష్టంతోనే నేను ఎదిగా: తూర్పు జగ్గారెడ్డి



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం హైదరాబాద్‌కు ఐటీఐఆర్‌ను మంజూరు చేసే వరకూ దానిపై మాట్లాడుతూనే ఉంటానని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి స్పష్టం చేశారు. పార్లమెంటు సమావేశాలు అయిపోయిన తర్వాత కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం ఇస్తానని, రద్దయిన ఐటీఐఆర్‌ను తిరిగి తీసుకురావాలని కోరతానని వెల్లడించారు. ప్రతిపక్షం తరఫున తమ బాధ్యత నిర్వర్తిస్తామని వెల్లడించారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 14 ఎంపీ సీట్లు కాంగ్రెస్‌కు వచ్చుంటే.. రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యేందుకు అవకాశం ఉండేదేమోనన్నారు. అప్పుడు తామంతా రాహుల్ దగ్గర కూర్చుని హైదరాబాద్‌కు తిరిగి ఐటీఐఆర్‌ను మంజూరు చేయించుకుని ఉండేవాళ్లమని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు సోనియా, మన్మోహన్‌సింగ్ ఇచ్చిన ఐటీఐఆర్‌ను మోదీ ప్రభుత్వం రద్దు చేయకుండా ఉంటే రాష్ట్రంలోని యువతకు ఈ పదేళ్లలో సుమారు 15లక్షల ఉద్యోగాలు వచ్చుండేవన్నారు. ఆ ప్రాజెక్టు అమలై ఉంటే సెజ్‌లు, ఇండస్ట్రియల్ పార్కులు, ట్రేడ్, వేర్ హౌస్ జోన్లు, ఎక్స్‌పోర్టు ఓరియెంటెడ్ యూనిట్లు హైదరాబాద్‌లో విస్తరించి ఉండేవని పేర్కొన్నారు. ప్రభుత్వానికీ పెద్ద ఎత్తున ఆదాయం సమకూరి ఉండేదన్నారు. ఇంత గొప్ప ప్రాజెక్టును ఎన్డీయే ప్రభుత్వం నిలిపేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన 8మంది బీజేపీ ఎంపీలు ప్రత్యేకంగా దృష్టి పెట్టి ఐటీఐఆర్‌ను తిరిగి తెచ్చేందుకు కృషి చేయాలని కోరారు.

నా కష్టంమ్మీద నేను ఎదిగా

"ఐటీఐఆర్ గురించి నాకు అఆలు కూడా తెలియవని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అంటున్నారు. ఎడ్యుకేషన్‌పరంగా నేను వీక్ అయ్యుండొచ్చు. ఇంటర్ ఫెయిల్ అయ్యాను కూడా. రఘునందన్‌రావు పుస్తకాలు చదివితే.. నేను జీవితాన్ని చదివిన. పుస్తకాల్లో ఎవరో రాసింది ఉంటది. మెరిట్ స్టూడెంట్‌కు అనుభవాలు ఉండవు. జీవితాన్ని చదివిన వాడికి కష్టాలు, అనుభవాలు ఉంటయి" అని జగ్గారెడ్డి అన్నారు. తల్లిపాలు తాగి రొమ్ము గుద్దిండంటూ తనపై రఘునందన్‌రావు విమర్శలు చేస్తుండని, కానీ ఇక్కడ తల్లి పాత్రే తనదన్న సంగతి ఆయన తెలుసుకోవాలన్నారు. తన చిన్నతనంలో తమ దగ్గర ఆరెస్సెస్ శాఖలు నడుస్తుంటే.. పిల్లలమైన తాము గంట సేపు ఆడుకుని ప్రచారక్‌లు ఏదో చెబితే విని వస్తుండేవాళ్లమని చెప్పారు. రఘునందన్‌రావు బీజేపీలోకి డైరెక్టుగా వచ్చిండు కాబట్టి ఆ శాఖల గురించి ఆయనకు తెలియదన్నారు. ఐటీఐఆర్ మంజూరు చేసినప్పుడు ఆయన బీఆర్ఎస్‌లోనే ఉన్నారన్నారు. తన కష్టం మీద, తన తల్లి ప్రోత్సాహంతో తాను ఎదిగానని చెప్పారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేసి జైలుకూ వెళ్లానన్నారు. తన జోలికి వస్తే బీజేపీలో ఉండే కుళ్లు, కుతంత్రాలు చర్చకు పెడతానని హెచ్చరించారు.

ప్రాణాలు తీస్తున్న మద్యం

» 2019లో ప్రపంచ వ్యాప్తంగా 26 లక్షల మరణాలు

» ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మద్యం పానం ప్రజారోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా లక్షల సంఖ్యలో మరణాలకు కారణమవుతోంది. 'గ్లోబల్ స్టేటస్ రిపోర్టు ఆన్ ఆల్కహాల్ అండ్ హెల్త్ అండ్ ట్రీట్మెంట్ ఆఫ్ సబ్‌స్టాన్స్ యూజ్ డిజార్డర్' పేరిట ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ఇటీవల విడుదల చేసిన నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేసింది. మద్యం వినియోగానికి సంబంధించి 2019 నాటికి ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల నుంచి సేకరించిన గణాంకాల ఆధారంగా డబ్ల్యూహెచ్‌వో ఈ నివేదిక రూపొందించింది. దీని ప్రకారం 2019 నాటికి ప్రపంచవ్యాప్తంగా 40 కోట్ల మంది ఆల్కహాల్, మాదక ద్రవ్యాల వినియోగ రుగ్మతతో జీవిస్తున్నారు. వీరిలో 20.9కోట్ల మంది మందుబాబులు ఉన్నారు. మద్యపానం వల్ల కలిగే అనారోగ్యాల వల్ల 2019లో ప్రపంచ వ్యాప్తంగా 26 లక్షల మరణాలు సంభవించాయి. మొత్తం మృతుల్లో 20 లక్షల మంది పురుషులే ఉండడం గమనార్హం. అంతేకాక, మరణించిన వారిలో 20-39 ఏళ్ల లోపు వారే అత్యధికంగా ఉన్నారు. భారత్ విషయానికొస్తే 2019 నాటికి దేశ జనాభాలో 31 శాతం మంది మద్యపానం చేసే వారున్నారు. దేశంలోని పురుషుల్లో 40.9 శాతం మంది, మహిళల్లో 20.8 శాతం మంది మద్యపానం చేసేవారున్నారు. మద్యపానం వల్ల మరణించిన వారి సంఖ్యలోనైతే భారత్ ఏకంగా చైనాను అధిగమించింది. భారత్‌లోని ప్రతీ లక్ష మంది జనాభాలో 38 మంది మద్యం వల్ల మరణిస్తే చైనాలో ఈ సంఖ్య కేవలం 16గా ఉంది. కాగా, మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ప్రపంచవ్యాప్తంగా 2.98 లక్షల మంది మృత్యువాత పడ్డారు. కాగా, 2019 నాటికి ప్రపంచవ్యాప్తంగా తలసరి మద్యం వినియోగం 5.5 లీటర్లు(ఏడాదికి ఒక వ్యక్తి తాగే మద్యం)గా ఉంది. భారత్‌లో ఇది 4.9 లీటర్లుగా ఉండగా 2030 నాటికి అది 6.7 లీటర్లకు చేరనుందని డబ్ల్యూహెచ్‌వో అంచనా వేసింది.

మహిపాల్‌రెడ్డి చూపు.. బీజేపీ వైపు?

కమలం గూటికి చేరనున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే?

» ఈడీ తనిఖీలతో ఆందోళనలో బీఆర్ఎస్ నేత?

» ఢిల్లీకి రహస్య టూర్



పటాన్‌చెరు, జూన్ 26: బీఆర్ఎస్‌కు మరో షాక్ తగలనుందా? పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి బీజేపీలో చేరుతారా? ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జరిపిన తనిఖీల నేపథ్యంలో ఈ నిర్ణయానికి వచ్చారా? అంటే.. మహిపాల్‌రెడ్డి ఆకస్మికంగా ఢిల్లీ పర్యటనకు వెళ్లడంతో ఈ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం జహీరాబాద్ మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు బీబీ పాటిల్‌తో మహిపాల్‌రెడ్డి సమావేశం కావడం కూడా ఆయన బీజేపీ వైపు అడుగులు వేస్తున్నారన్న అభిప్రాయాన్ని కలిగిస్తున్నాయి. అయితే గతంలో బీఆర్ఎస్ తరఫున రెండుసార్లు జహీరాబాద్ ఎంపీగా పనిచేసిన బీబీ పాటిల్‌తో మహిపాల్‌రెడ్డికి సన్నిహిత సబంధాలున్నందున.. ఆ చనువుతో ఆయనను కలిశారనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కానీ, గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు పటాన్‌చెరు నియోజకవర్గంలో లక్ష పైచిలుకు ఓట్లు సాధించడంతో.. ఓటుబ్యాంకు బీజేపీ వైపు మళ్లిందన్న సంకేతాలు కనిపించాయి. బీఆర్ఎస్ ఏకంగా మూడో స్థానానికి పడిపోవడంతో తమ రాజకీయ భవిష్యత్తు ఏమిటన్న ప్రశ్న స్థానిక బీఆర్ఎస్ నేతల మెదళ్లను తొలుస్తోంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం ఇదే ఫలితాలు వస్తే కేడర్ మిగలదన్న భావన వ్యక్తమవుతోంది. అయితే ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తొలుత కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరిగినా.. ఈడీ సోదాల తరువాత పరిణామాలు వేగంగా మారిపోయాయి. పటాన్‌చెరు నియోజకవర్గంలో తన ప్రధాన అనుచరులుగా చెప్పుకొనే వారికి సైతం చెప్పకుండా ఆయన ఢిల్లీకి వెళ్లారు. కేవలం కేసు పనిమీద న్యాయవాదులను కలిసేందుకు వెళ్లినట్లు ఆయన అనుచరులు చెబుతున్నా.. బీజేపీ నేత బీబీ పాటిల్‌తో మంతనాలకు సంబంధించి మాత్రం సమాధానం కరువైంది. అంతేకాకుండా బీజేపీ సంగారెడ్డి జిల్లా ముఖ్యనాయకుడు సైతం ఎమ్మెల్యే వెంట వెళ్లడం అనుమానాలు మరింత బలపడేలా చేస్తోంది.

కాంగ్రెస్ చేరేందుకు స్థానికంగా వ్యతిరేకత

మహిపాల్‌రెడ్డి తొలుత కాంగ్రెస్‌లో చేరేందుకే ప్రయత్నాలు చేశారని, కానీ.. ఆయన ప్రయత్నాలను స్థానిక కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గారని సమాచారం. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి రెండో స్థానంలో నిలిచిన నీలం మధు ముదిరాజ్.. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చేరికను వ్యతిరేకించినట్లు తెలిసింది. మరోవైపు మహిపాల్‌రెడ్డి, ఆయన సోదరుడు మధుసూదన్‌రెడ్డి ఇళ్ల, కార్యాలయాల్లో ఈడీ అధికారులు ఇటీవల తనిఖీ చేసి పెద్ద ఎత్తున స్థిరాస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు, నగదును స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతోపాటు బినామీలుగా భావిస్తున్న కొందరిని ఈడీ కార్యాలయానికి పిలిపించి అక్రమాస్తులపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. కిష్టారెడ్డిపేట గ్రామానికి చెందిన ఓ బిల్డర్ మధుసూదన్‌రెడ్డికి బినామీగా వ్యవహరిస్తున్నట్లు ఆధారాలు లభ్యం కావడంతో ఆయన నుంచి వివరణ అడిగారు. మిగతా బినామీ వ్యక్తులు ఈడీ నుంచి తప్పించుకునేందుకు నానా పాట్లు పడుతున్నారని తెలిసింది. ఎవరికి ఎప్పుడు ఈడీ నుంచి పిలుపు వస్తుందో, ఎవరి ఇళ్లలో సోదాలు చేస్తారోనన్న భయంతో వారు బిక్కుబిక్కుమంటున్నారు.

6 నెలల్లో అన్నీ తారుమారవుతాయి

(మొదటి పేజీ తరువాయి)

చూస్తున్నారన్న మాటలు కార్యకర్తల నుంచి వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో ఆయన కేసీఆర్‌ను కలవడంతో ఆ ఊహాగానాలకు తెరపడినట్టేనని కొందరు భావిస్తుండగా, మరికొందరు నాయకులు మాత్రం పార్టీ మారే అవకాశాలను కొట్టిపారేయలేమని వాదిస్తున్నారు. ఐదుగురు ఎమ్మెల్యేలు కేసీఆర్‌ను కలిసి చర్చలు జరిపినప్పుడు మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా ఉన్నట్లు సమాచారం. లక్ష్మారెడ్డి వెంట నియోజకవర్గ నాయకులు తరలివెళ్లారు. నాయకులందరూ కేసీఆర్‌తో ఫొటోలు దిగిన అనంతరం అక్కడే భోజనాలు చేశారు. ఆయనను కలిసిన వారిలో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు. వారితో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు దాదాపు ఐదు గంటల పాటు కేసీఆర్ ఫాంహౌస్‌కు వచ్చిన కార్యకర్తలను కలిశారు.

మాదకద్రవ్యాలను నిర్మూలించాలి


కోదాడలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ టౌన్, జూన్ 26: ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మాదక ద్రవ్యాలను నిర్మూలించడానికి కృషి చేయాలని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా బుధవారం కోదాడలోని బాలుర ఉన్నత పాఠశాలతో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆర్డీవో సూర్యనారాయణ, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించి మాట్లా డారు. డ్రగ్స్ మహమ్మారితో యువత తమ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటోందని, గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం కాశీనాథం పంక్షన్‌హాల్‌లో కళాశాల విద్యార్థులకు ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా డ్రగ్స్ తీసుకుంటే కలిగే నష్టాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ మత్తు పదార్థాలు వినియోగించే వారిపై, విక్రయించే వారిపై ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో కోదాడ మునిసిపల్ చైర్మన్ సామినేని ప్రమీల, వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, ఎంపీపీ మల్లెల రాణి, జడ్పీటీసీ కృష్ణకుమారి, కోదాడ పట్టణ సీఐ రాము, రూరల్ సీఐ రజితరెడ్డి, డాక్టర్లు జాస్తి సుబ్బారావు, దశరథ, డివిజన్ విద్యాధికారి సలీంషరీఫ్, ఎన్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ వి.వెంకటేశ్వర్లు, ఎస్ఐలు, రంజిత్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, నవీన్, రాంబాబు, మల్లేష్ పాల్గొన్నారు.

మునగాల రూరల్: మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే వారి బంగారు భవిష్యత్తుతో పాటు దేశ భవిష్యత్ నాశనమవుతుందని ఎంపీడీవో రమేష్ దీన్‌దయాల్ అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమాల్లో మాట్లాడారు. మాదకద్రవ్యాలు సేవించినా, కలిగిఉన్నా చట్ట ప్రకారం నేరమని తెలిపారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగంతో ఏర్పడే దుష్ఫలితాలపై ఏఎస్ఐ నాగేశ్వరరావు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ సాయిాశ్వరి, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కాసాని నాగేశ్వరరావు, అంబేద్కర్, ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

మోతె: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని డాక్టర్ నాగరాజు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో ప్లకార్డులతో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ బిందు, సిబ్బంది కమలమ్మ, ఫాతిమా, శ్రీనివాస్, ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి, బొడ్డు సాలయ్యగౌడ్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



సూర్యాపేటలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి

సూర్యాపేటలీగల్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూర్యాపేట సీనియర్ సివిల్ జడ్జీ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ పి.శ్రీవాణి అన్నారు. బుధవారం జిల్లా కోర్టు కార్యాలయంలో నిర్వహించిన న్యాయ సాక్షరతా శిబిరంలో మాట్లాడుతూ దేశ బంగారు భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని తెలిపారు. కార్యక్రమంలో సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డప్పు మల్లయ్య, న్యాయవాదులు జె.శశిధర్, తలమల్ల హుస్సేన్, ఏడిండ్ల అశోక్, వసంత సత్యనారాయణపిళ్లై, పి.వాణి పాల్గొన్నారు.

యువతపైనే దేశ భవిష్యత్ ఆధారం



హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్యాంకుమార్

హుజూర్‌నగర్: యువతపైనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. యువకులు, విద్యార్థులు దురలవాట్లకు బానిస కావొద్దన్నారు. గంజాయి మహమ్మారిని తరిమికొట్టాలన్నారు. మాదక ద్రవ్యాలను అరికట్టాలన్నారు. విద్యార్థుల భవిష్యత్ ఉన్నత స్థాయిలో ఉండాలన్నారు. సమాజంలో మంచిని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి జక్కుల వీరయ్య, సుందరి రాఘవరావు, సైదులు, శంకర్, సైదా, హుస్సేన్, ప్రిన్సిపాల్ భీమార్జున్‌రెడ్డి, సీఐ చరమందరాజు, ఎస్ఐ ముత్తయ్య, శ్యాంకుమార్, సుశీల, ప్రసాద్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు సరఫరా చేసేవారి సమాచారం అందించాలి

నాగారం: మాదక ద్రవ్యాలు సరఫరా చేసేవారి సమాచారాన్ని ప్రజలు పోలీసులకు అందించాలని నాగారం ఎస్ఐ వెంకట్‌రెడ్డి అన్నారు. గంజాయి, డ్రగ్స్ వినియోగంతో వచ్చే ఆరోగ్య సమస్యలపై బుధవారం నాగారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్ వినియోగించే యువకులను ప్రజలు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వల్కి వెంకన్న, శ్రీనివాస్, రవీందర్, రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



నాగారంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నూతన్‌కల్: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తుంగతుర్తి సీఐ శ్రీనివాస్‌నాయక్ కోరారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుకు యువత బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సైదులు, ఎంఈవో రాములునాయక్, పారా లీగల్ కార్యకర్త జయమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

వసతి గృహాలను సద్వినియోగం చేసుకోవాలి


అధ్వానంగా ఉన్న రోడ్డును పరిశీలిస్తున్న అధికారి శంకర్

తుంగతుర్తి, జూన్ 26: ప్రభుత్వ వసతి గృహాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి కేశంకర్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసి మాట్లాడారు. జిల్లాలో 10వసతి గృహాలు, ఎనిమిది కళాశాలల హాస్టల్స్, మూడు ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయని, వాటిల్లో 2,400 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. గిరిజన వసతి గృహాల్లో విద్యార్థులకు నోట్‌బుక్స్, దుస్తులు, కాస్మొటిక్స్ మొదలగు సౌకర్యాలు అందిస్తున్నామన్నారు. వసతి గృహాలకు మరమ్మతులు చేయిస్తామన్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. హాస్టల్‌కు వెళ్లే రహదారి అధ్వానంగా ఉందని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి మరమ్మతు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో వార్డెన్ సాయిరాం పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలి


తుంగతుర్తిలో శిక్షణ పొందిన అంగన్‌వాడీ టీచర్లు

తుంగతుర్తి, జూన్ 26: అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు టీచర్లు కృషి చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో వెంకటరమణ అన్నారు. బుధవారం తుంగతుర్తి మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లకు ఈసీసీఈపై మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్లేస్కూల్ నిర్వహణపై దిశానిర్దేశం చేశామన్నారు. గ్రామాల్లోని 3-6 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ స్థాయిలో ప్రేరణాత్మక, కృత్యాధార బోధన ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు ఆట పాటలు, ప్రకృతి, సైన్స్, యోగ, గణితంతో పాటు రంగుల బొమ్మలతో ఇతర అంశాలపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ప్రమీల, లక్ష్మి, అనురాధ, ఆయా గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు పాల్గొన్నారు.

'రజతోత్సవాలను విజయవంతం చేయాలి'

కోదాడ టౌన్, జూన్ 26: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జూలై ఏడో తేదీన నిర్వహించే మాదిగ ఉపకులాల దండోరా రజతోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతా బాబు అన్నారు. ఎమ్మార్పీఎస్ కోదాడ నియోజకవర్గ ఇన్ చార్జి బాణాల అబ్రహం, పట్టణ అధ్యక్షుడు ఏర్పుల చిన్ని అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రజతోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఎ. కార్యక్రమంలో బొల్లెపోగు స్వామి, పిడమర్తి బాబు నారకట్ల ప్రసాద్, కందుకూరు నాగేశ్వరరావు, చింత వినయ్, అమరబోయిన ప్రభు, చంటి, సిసింద్రి, కందుకూరి తిరుపతి, శ్రీను, వెంకటి, వెంకటయ్య పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


హుజూర్‌నగర్ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

హుజూర్‌నగర్, జూన్ 26: పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం గోదా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలకు సామూహిక శ్రీవిష్ణుసహస్ర నామ స్తోత్ర పారాయణం, కుంభారాధాన, నిత్యహోమం, పూర్ణాహుతి, బలి ప్రదానం నిర్వహించారు. గరుడ వాహన సేవ అనంతరం కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, రాజ్యలక్ష్మి, నారాయణరెడ్డి, వెంకటనారాయణరెడ్డి, రంగారెడ్డి, నర్సిరెడ్డి, ఆనంద్, మల్లికార్జున్, నర్సింహారావు, శంకర్‌రావు, నాగేశ్వరరావు, సోమిరెడ్డి, జయప్రద పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా లక్ష్మీనృసింహునికి ..


మట్టపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి, జూన్ 26: మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో బుధవారం లక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగల్యధారణ, తలంబ్రాలతో నిత్య కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం దివ్య మూర్తులకు గరుడోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్, అర్చకులుపాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ త్రయోదశ వార్షికోత్సవం


ఆలయ త్రయోదశ వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్న భక్తులు

గరిడేపల్లి, జూన్ 26: మండలంలోని కీతవారిగూడెంలోని హరిహరపుత్ర ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయ త్రయోదశ వార్షికోత్సవాన్ని బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, గణపతిపూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, రక్షాబంధనం, పంచగవ్యప్రాసన, స్వామి వారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, శ్రీలక్ష్మీ గణపతి, రుద్ర, నవగ్రహ, వాస్తు హోమాలు, మహాపూర్ణాహుతి నిర్వహించారు. స్వామివారికి పట్టువస్త్రాలను దేవాలయ కమిటీ అధ్యక్షుడు అమరగాని బక్కయ్య నారాయణమ్మ దంపతులు సమర్పించారు. తదుపరి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు రాయప్రోలు భద్రయ్యశర్మ, శ్రీరామయ్యశర్మ, ఉపేందర్‌శర్మ, పవన్‌కుమార్‌శర్మ, అనిల్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం చేస్తున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి నాగన్న

హుజూర్‌నగర్, జూన్ 26: పట్టణానికి చెందిన ఐఎన్‌టీయూసీ నాయకుడు, రైస్‌మిల్ డ్రైవర్ తురక కొండలు ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా, ఆయన కుటుంబానికి రైస్ మిల్ యూనియన్ డ్రైవర్లు బుధవారం రూ.63వేలను సమకూర్చారు. ఈ నగదును కొండలు కుటుంబానికి ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ అందజేశారు. కార్యక్రమంలో తురక నాగమణి, పచ్చిపాల ఉపేందర్, పర్వతాలు, గురవయ్యగౌడ్, చింతకాయల రాము, వీరబాబు, సుబ్బారావు, బాలకృష్ణ, వెంకటరెడ్డి, వీరబాబు, కనకయ్య పాల్గొన్నారు.

లెక్చరర్ స్వాతికి డాక్టరేట్



సూర్యాపేటఅర్బన్, జూన్ 26: మండలంలోని బాలెంల గురుకుల డిగ్రీ కళాశాల లెక్చరర్ వెలిశాల స్వాతికి కామర్స్ విభాగంలో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. బుధవారం హైద రాబాద్‌లో స్వాతికి డాక్టరేట్ పట్టాను డాక్టర్ శంకరయ్య అందజేశారు. అనంతగిరి మండలం గోండ్రియాల గ్రామానికి వెలిశాల వెంకటాచారి, ధనమ్మల కుమార్తె స్వాతి 'ప్రెసింగ్ ఎఫెన్సీ ఆఫ్ ఐపస్-ఎ స్టడీ ఆన్ బీఎస్ఈ లిస్టెడ్ ఎస్ఎంఈఎస్' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందిదన్నారు.

పేదల సంక్షేమానికి పాటుపడిన ఎన్టీఆర్


అలింగాపురంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు

పాలకవీడు, జూన్ 26: ఉమ్మడి ఏపీ రాష్ట్రంలో పేదల సంక్షేమానికి ఎన్టీఆర్ కృషి చేశారని నల్లగొండ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సీడీ రవికుమార్ అన్నారు. బుధవారం పాలకవీడు మండలంలోని అలింగాపురంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడారు సినీ, రాజకీయ రంగంలో ఎన్టీఆర్ నెంబర్ వన్‌గా కొనసాగి యావత్ తెలుగు ప్రజల మనసుల్లో కొలువై ఉన్నారన్నారు.రూ.2లకు కిలో బియ్యం, మండల వ్యవస్థ, జనతా వస్త్రాలు లాంటి అనేక పథకాలను ఎన్టీఆర్ ప్రవేశ పెట్టి పేదల ఆశాజ్యోతి అయ్యారని కొనియాడారు. ఎన్టీఆర్ ఆశయాలను సాధించడానికి తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకులు కశిరెడ్డి శేఖర్‌రెడ్డి, మండవ వెంకటేశ్వర్లుగౌడ్, మాజీ ఎంపీపీ సైదులు, వెంకటేశ్వరరావు, వాసు, రోశపతి, వీరభద్రరావు, వంశీ, రామారావు, బాలాజీనాయక్, కొండలు తదితరులు పాలొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం: పద్మావతి


చిలుకూరులో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ రూరల్, చిలుకూరు, జూన్ 26: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. బుధవారం కోదాడలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో చిలుకూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే నియోజకవర్గంలో రోడ్లు, ఎత్తిపోతల పథకాలు, వంతెనలు వంటి అభివృద్ధి పనులకు రూ.400కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. గ్రామాల్లో అధికారులు ప్రజా సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామీణా భివృద్ధి కింద వచ్చే పథకాలను ప్రజలకు వివరించాలని ఏపీఎంను ఎమ్మెల్యే ఆదేశించారు. కూచిపూడి ఎంపీటీసీ శంకరశెట్టి కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్, పాఠశాలలు, వ్యవసాయం, మౌలిక వసతులు, పొదుపు సంఘాల సమస్యలను సభ దృష్టికి తీసుకువెళ్లగా, పరిష్కరి స్తామని ఆయా శాఖల అధికారులు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను సభ్యులు సన్మానించారు. ఎంపీపీ మల్లెల రాణిబ్రహ్మయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జడ్పీటీసీ మందలపు కృష్ణకుమారిశేషు, వైస్ ఎంపీపీ లిక్కి, గుర్వమ్మ, తహసీల్దార్ సాయిగౌడ్, ఎంపీడీవో రామచందర్‌రావు, ఎంపీవో పాండురంగన్న, పీఏసీఎస్ చైర్మన్లుశ్రీనివాసరెడ్డి, నంబూరి సూర్యం, కొత్త రఘుపతి, నలజాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● చిలుకూరు మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖలపై అధికారుల నివేదికలను చదివి వినిపించారు. మండల సమాఖ్య ఏపీఎం దుర్గాప్రసాద్, ఉపాధిహామీ ఏపీవో నిర్మలను నివేదికలో తప్పులపై ప్రశ్నించారు. గ్రామాల్లో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని వైస్ ఎంపీపీ జానకి కృష్ణారావు, లింకు రోడ్లకు నిధులు మంజూరు చేయాలని, ఆర్టీసీ బస్సులు గ్రామాలకు నడపాలని ఎంపీపీ ప్రశాంతి కోటయ్యలు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు.

● అదేవిధంగా మండల కేంద్రంలోని ఆనంద్ పాల సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పాలకేంద్రం వద్ద అధిక మొత్తంలో మండల కేంద్రం నుంచి పాలు పోసిన రైతులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. అనంతరం మండల కేంద్రంలోని కాల్వ ఒడ్డున ఉన్న దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం కోసం స్థలాన్ని అందజేసిన దాత, ఆలయ చైర్మన్ కొడారు వెంకటేశ్వర్లును సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ ప్రశాంతి కోటయ్య, జడ్పీటీసీ శిరీషనాగేంద్రబాబు, వైస్ ఎంపీపీ జానకి కృష్ణారావు, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు జానీమియా, ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ ధ్రువకుమార్, ఎంపీడీవో గిరిబాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కీత వెంకటేశర్లు, పిండ్రాతి హనుమంతరావు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

● మండల కేంద్రంలో రూ.48 లక్షలతో నిర్మించిన నూతన గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే పద్మావతిప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గంథాలయాన్ని గ్రామంలోని విద్యార్థులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిరుద్యోగ సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలి


మునగాలలో మాట్లాడుతున్న కోట రమేష్

మునగాల/ రూరల్, జూన్ 26: రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మునగాల మండల కేంద్రంలో, నేలమర్రి గ్రామంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో యువజన సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ నియామకాలపై జాబ్ క్యాలెండర్ ప్రకటించాలన్నారు. మెగా డీఎస్సీ ప్రకటించడంతో పాటు 25వేల డీఎస్సీ పోస్టులు పెంచాలన్నారు. గ్రూప్-2, గ్రూప్-3 పోస్టులు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చెల్లిస్తానన్న రూ.4వేల నిరుద్యోగ భృతిని తక్షణం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాసాని కిషోర్, బోయిళ్ల నవీన్, నాయకులు వినోద్, సతీష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలను విస్తరించాలి


సభ్యుల ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, జూన్ 26: లయన్స్‌క్లబ్ సేవలను విస్తరించాలని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంతో పాల్గొని మాట్లాడారు. సేవలను నూతన కార్యవర్గం విస్తరించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా కొండపల్లి లక్ష్మారెడ్డి, కార్యదర్శిగా వెంపటి శబరీనాథ్, కోశాధికారిగా మీలా వంశీతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త మీలా మహదేవ్, ఏఐసీసీ ప్రతినిధి రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, కొప్పుల వేణారెడ్డి, కౌన్సిలర్ కక్కిరేణి శ్రీనివాస్, జగన్మోహన్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, గుడిపూడి వెంకటేశ్వర్‌రావు, గండూరి కృపాకర్, దేవిరెడ్డి రవీందర్‌రెడ్డి, రంగు దీలీప్‌కుమార్, ఫణికుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి భూమి ఇవ్వడం అభినందనీయం

గరిడేపల్లి, జూన్ 26: ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసం దాతలు భూమి ఇవ్వడం అభినందనీయమని ఎంపీడీవో వనజ అన్నారు. మండలంలోని వెలిదండ గ్రామంలో పల్లె దవాఖానా భవనం నిర్మాణానికి ఆ గ్రామానికి చెందిన కంభంపాటి గాంధీకోటిరత్నమ్మ, కంభంపాటి వెంకటరమణస్వప్న, కంభంపాటి శ్రీనివాస్‌లక్ష్మీశైలజ, దంపతులు పల్లె దవాఖానాకు రూ.12లక్షల విలువైన 200గజాల స్థలం ఇచ్చారు. అదేవిధగా పశు వైద్యశా లకు కొల్లు విద్యాసాగర్‌పద్మావతి, నున్నా సత్యనారాయణ లక్ష్మీకాంతమ్మ దంపతులు రూ.15లక్షల విలువైన 300గజాల స్థలం ఇచ్చారు. ఈ దాతలను బుధవారం వెలిదండలో గ్రామ పెద్దలతో కలిసి ఎంపీడీవో సన్మానించి మాట్లాడారు. గ్రామాల్లో దాతలు ముందుకు వచ్చి గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మలిదశ తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ కన్వీనర్ మేకల నాగేశ్వరరావు, చెనగాని సాంబయ్య, నర్సింహారావు, మాజీ సర్పంచ్ ఆదూరి పద్మకోటయ్య, సీతారాములు, మాశెట్టి అంజయ్య, గండు శ్రీను, పెద వెంకటి, లింగయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్)నాయకుడు సోమయ్య మృతి

నాగారం, జూన్ 26: మండలంలోని డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన సీపీఐ(ఎంఎల్) నాయకుడు దిగోజు సోమయ్య(55)అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. కొత్తపల్లి గ్రామంలో సోమయ్య మృతదేహానికి ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్ బుధవారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమయ్య మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. నివాళులర్పించివారిలో బొడ్డు శంకర్, పోలెబోయన కిరణ్, యానాల సుధాకర్‌రెడ్డి, సంపెట కాశయ్య, కడారి సైదులు, సంపెట కృష్ణమూర్తి ఉన్నారు.



సూర్యాపేట సిటీ: బొగ్గు గనుల వేలాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఈ నెల 29వ తేదీన నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. బొగ్గు గనుల వేలాన్ని వ్యతిరేకిస్తున్నామని పైకి చెబుతూ బొగ్గు వేలానికి బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు సహకరిస్తున్నాయని ఆయన ఆరోపించారు.

మేళ్లచెర్వు: విద్యుత్ భద్రతపై ప్రతి ఒక్కరికీ కనీస అవగాహన ఉండాలని మైహోం ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలను బుధవారం మైహోం పరిశ్రమలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఉత్తమ్‌సింగ్, శ్రీవాత్సవ, డీజీఎం వేణుబాబు, సూర్యనారాయణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కోదాడ టౌన్: ప్రైవేట్ విద్యాసంస్థల్లో పాఠ్య పుస్తకాలు, స్టేషనరీ విక్రయాలని నిషేధించాలని, అధిక ఫీజు వసూళ్లని అరికట్టాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రరావు ఒక ప్రకటనలో కోరారు.

సూర్యాపేట అర్బన్: సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా రూపకర్త దుర్గంపూడి వెంకటకృష్ణారెడ్డి ఆశయాలను సాధించాలని సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. కృష్ణారెడ్డి వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని విక్రమ్‌భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో కారింగుల వెంకన్న, కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్‌కుమార్, సయ్యద్, పిడమర్తి లింగయ్య, వీరబాబు, వాజిద్, హుస్సేన్, ఉపేందర్, సైదులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల: పట్టణంలోని పాత నేరేడుచర్లలో ఈద్గా కోసం స్థలాన్ని సర్వే నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది వెళ్లగా కమలానగర్, పాత నేరేడుచర్లకు చెందిన ప్రజలు అడ్డుకున్నారు. తమ రెండు గ్రామాల్లో ఒక్క ముస్లిం కూడా లేడని, ఇక్కడ ఈద్గాకు ఎలా స్థలం కేటాయిస్తారని ప్రశ్నించారు. ఈ మేరకు తహసీల్దార్ సైదులుకు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

మఠంపల్లి: లంబాడ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో హైదరాబాదులోని రవీంద్రబారతిలో జూలై ఒకటో తేదీన నిర్వహించే గోర్ బంజార సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి బానోతు నాగేశ్వరావునాయక్ కోరారు. మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు భూక్య రవి, విజేందర్, గిరీష్‌నాయక్, చందర్, గణేష్‌నాయక్, పాల్గొన్నారు.

కోదాడ రూరల్: మండలంలోని చిమిర్యాల ప్రాథమిక పాఠశాలలో 70మంది విద్యార్థులకు సంవత్సరానికి సరిపడా నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేళ్లు, పలకలను రావూరి రంగయ్య సతీమణి లక్ష్మి అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కమలాకర్‌రావు పాల్గొన్నారు.

తుంగతుర్తి: మండల కేంద్రంలోని రిటైర్డు ఉద్యోగుల సంఘం భవనంలో ఈనెల 28నఉచిత వైద్య కంటి శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు పోలవరపు సంతోష్ తెలిపారు.

మోతె: నులిపురుగుల నివారణకుప్రతి విద్యార్థి అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని డాక్టర్ నాగరాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను వేసి మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ బిందు, సిబ్బంది కమలమ్మ, ఫాతిమా, శ్రీనివాస్, ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి, సామాజిక సేవకుడు బొడ్డు సాలయ్యగౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన్‌కల్: ప్రజాపాలనలో గతంలో దరఖాస్తు చేసుకోనివారు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సునీత కోరారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు.